# సమగ్ర సర్వే కంప్యూటరీకరణ



సత్తుపల్లి మున్సిపాలిటీలో సర్వే సమాచారాన్ని కంప్యూటరీకరణ చేస్తున్న ఆపరేటర్లు

**సత్తుపల్లిటౌన్:** సత్తుపల్లి మున్సిపాలిటీలో ఈ నెల 9వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర కుటుంబ సర్వే 94శాతం పూర్తి అయ్యింది. పట్టణంలోని 11,531 కుటుంబాలకు గాను 10,808 కుటుంబాలను సర్వే నిర్వహించారు. మున్సిపాలిటీలోని 23వ వార్డులతో పాటు కొమ్మేపల్లి, సింగరేణి కాలనీలను కలిపి 97 బ్లాక్‌లుగా విభజించారు. దాదాపు అన్ని బ్లాక్‌ల్లోనూ సర్వే చివరి అంకానికి చేరుకుంది. సుమారు 30కిపైగా బ్లాక్‌లో నూరుశాతం సర్వే నిర్వహించారు.

**కంప్యూటరీకరణ..**

ఈ నెల 26వ తేదీ వరకు సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. అయితే ఈలోగా 100శాతం సర్వే పూర్తి చేసిన బ్లాక్‌లలోని సమగ్ర కుటుంబ సమాచారాన్ని ప్రభుత్వ వెబ్‌సైట్‌లో కంప్యూటరీకరణ చేసేందుకు యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఖమ్మంలో ఇటీవల మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇచ్చి మున్సిపాలిటీలోని 23 వార్డులకు డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించారు. 25 కంప్యూటర్లను సిద్ధం చేస్తున్నారు. సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఎన్యూమరేటర్ల సమక్షంలో సమగ్ర కుటుంబ సర్వే సమాచారాన్ని కంప్యూటరీ కరణను శుక్రవారం ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ మందా రవిబాబు, మేనేజర్ మైసా శ్రీనివాస్ పర్యవేక్షించారు.

## కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

**చింతకాని/బోనకల్/ఎర్రుపాలెం:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఖమ్మం ఆర్డీఓ నర్సింహారావు ఎన్యూమరేటర్లకు సూచించారు. శుక్రవారం చింతకానిలో, బోనకల్ మండలంలోని రావినూతల గ్రామంలో, ఎర్రుపాలెంలోని బనిగండ్లపాడు, ఎర్రుపాలెం గ్రామాల్లో నిర్వహిస్తున్న కుటుంబ సర్వేలను ఆయన పరిశీలించారు. కుటుంబ సర్వేను నెలాఖరు వరకు పూర్తి చేయాలని తెలిపారు. మండలాల్లో ఇప్పటివరకు పూర్తిచేసిన కుటుంబ సర్వేకు సంబంధించి ఆన్‌లైన్ డేటా ఎంట్రీ ప్రక్రియను ప్రారంభించాలని అధికారులను ఆదేశించటంతో డేటా ఎంట్రీ ప్రక్రియను ప్రారంభించారు. అనంతరం బోనకల్‌లోని అంతర్‌రాష్ట్ర ధాన్యం చెక్‌పోస్టను, ఎర్రుపాలెంలో మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న మార్కెట్ కమిటీ చెక్‌పోస్టును తనిఖీ చేశారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు కూరపాటి అనంతరాజు, పున్నం చందర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రఘు, సూపర్‌వైజర్ రమాదేవి, ఐకేపీ ఏపీఎం వెంకటేశ్వర్లు, ఎంపీఈఓ శ్రీలక్ష్మి, ఆర్‌ఐలు రవికుమార్, రాజశేఖర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

**అంతర్రాష్ట్ర చెక్ పోస్టు తనిఖీ..**



పోలీసులతో మాట్లాడుతున్న ఆర్డీఓ నరసింహారావు

**మధిర:** మండలంలోని మాటూరు క్రాస్ రోడ్‌లో ఏర్పాటు చేసిన పీపీసీ చెక్ పోస్టును శుక్రవారం ఆర్డీఓ నరసింహారావు తనిఖీ చేసి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తెలంగాణలోకి ధాన్యం రాకుండా పర్యవేక్షణ చేయాలని సూచించారు. అనంతరం రాయపట్నంలో మంజూరైన పెట్రోల్ బంక్ స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ రాంబాబు ఉన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



వెన్నవెల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**కల్లూరురూరల్:** రైతులు తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని ఏఎంసీ చైర్మన్ భాగం నీరజదేవి అన్నారు. శుక్రవారం కల్లూరుమండలంలోని వెన్నవెల్లిగ్రామంలో ఐకేపీ గ్రామ సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు మద్దతు ధరతో పాటు బోనస్‌కూడా పొందాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పులి సాంబశివుడు, ఎంపీడీఓ దాసరి చంద్రశేఖర్, ఐకేపీ ఏపీఎం వెంకటరామారావు, ఐకేపీ సీసీ ఎస్తేరు, మాజీ సర్పంచ్ శ్రీమన్నారాయణ, ఐకేపీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

**కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన ఆర్డీఓ..**

**వేంసూరు:** వేంసూరు మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆర్డీఓ రాజేంద్ర ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర దొరుకుతుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎంఏ రాజు, ఎస్‌ఐ వీర ప్రసాద్, ఆర్‌ఐ చిరంజీవి పాల్గొన్నారు.

**దళారులకు అమ్మాల్సి వస్తోంది..**

**తల్లాడ:** సీసీఐ కేంద్రాల్లో నిబంధనల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని రైతు సంఘం జిల్లానాయకులు శీలం సత్యనారాయణరెడ్డి అన్నారు. తల్లాడలో శుక్రవారం ఆయన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి మాట్లాడారు. తేమశాతం పేరుతో రైతుల తెచ్చిన పత్తిని తిప్పి పపండం వల్ల వారు మళ్లీ ఇంటికి తీసుకెళ్లలేక, వాహన కిరాయిలు బరించలేక అక్కడికక్కడే బయట దళారులకు విక్రయించుకోవాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు అయినాల రామలింగేశ్వరరావు, చల్లా నాగేశ్వరరావు, సత్తెనపల్లి నరేష్ పాల్గొన్నారు.

## నాణ్యమైన ఔషధాల తయారీకి కృషి చేయాలి

**బ్రౌన్స్ కళాశాలలో ఘనంగా ఓరియంటేషన్**




మాట్లాడుతున్న ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు

**కొణిజర్ల:** ఫార్మసీ విద్యార్థులు నాణ్యమైన ఔషధాల తయారీకి తాము నేర్చుకున్న విజ్ఞానాన్ని ఉపయోగించాలని ఖమ్మం ప్రభుత్వ వైద్య శాఖ సూపరెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్, ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రాజేశ్వరరావు సూచించారు. మండలంలోని తనికెళ్లలో గల బ్రౌన్స్ ఫార్మసీ కళాశాలలో బీఫార్మసీ, ఫార్మ్–డీ కోర్సుల్లో ప్రవేశం పొందిన ప్రథమ సంవత్సర విద్యార్థులకు శుక్రవారం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారితో పాటుగా కళాశాల చైర్మన్ పారుపల్లి ఉషాకిరణ్‌కుమార్ మాట్లాడారు. విద్యార్థులు ప్రణాళికతో విద్య నభ్యసించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ జగన్నాద్ పాత్రో, ఏఓ చెరుకూరి హన్మంతరావు, వివిధ విభాగాల హెచ్ఓడీలు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగులకు బస్ పాస్‌లు పంపిణీ

**కల్లూరురూరల్:** జిల్లాలో ప్రముఖ వైద్యుడు వేము గంగరాజు ఆర్థిక సాయంతో కల్లూరు మండలంలోని పెద్దకోరుకొండి గ్రామంలో శుక్రవారం దివ్యాంగులకు రాయితీపై బస్ పాస్‌లను పంపిణీ చేశారు. గడువు పూర్తైన వారికి సత్తుపల్లి డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి అందించారు. ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు, డీలక్స్ బస్సుల్లో దివ్యాంగులకు 50శాతం రాయితీ కల్పించడం జరుగుతుందన్నారు. దీంతో డాక్టర్ గంగరాజును డిపో మేనేజర్ అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రత్తమ్మ, వేము ఇషాక్, విలేజ్ బస్ ఆఫీసర్ కిన్నెర ఆనందరావు, దివ్యాంగుల సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి జానారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

### పంచాయతీ కార్యదర్శుల నూతన కమిటీ ఎన్నిక

**వైరారూరల్:** వైరాలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవార పంచాయతీ కార్యదర్శులు సమావేశం నిర్వహించుకొని నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వైరా మండల పంచాయతీ కార్యదర్శుల సంఘానికి అధ్యక్షుడిగా వరికూటి సురేష్‌బాబు (గరికపాడు), గౌరవ అధ్యక్షుడిగా చిట్టిపోతుల వెంకటేశ్వర్లు (గన్నవరం), ఉపాధ్యక్షులుగా వేమా ప్రత్తిపోత్తంరావు (లింగన్నపాలెం), కోట సునీత (గొల్లపూడి, ప్రధాన కార్యదర్శిగా కర్నాటి హేమలత (దాచాపురం), కోశాధికారిగా ఉబ్బన లక్ష్మణ్‌రావు (వల్లాపురం) అలాగే కార్యవర్గ సభ్యులుగా ఆర్. భారతి, జూపుడి అజయ్‌కుమార్, కె, నిర్మలన, రవీంద్ర, మానస భవాని, అనూష, హెచ్‌వీ ప్రసాద్‌రావు, సీహెచ్ నాగేశ్వరరావు, ఎం. కృష్ణయ్య, అరుణ, శ్రీలతలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

### యాంటీబయోటిక్స్ వాడకంపై అవగాహన

**బోనకల్:** మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం యాంటీబయోటిక్స్ మందుల వాడకంపై నర్సింగ్ ట్రైనింగ్ పిల్లలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి స్రవంతి మాట్లాడుతూ.. యాంటీబయోటిక్స్ మందులను డాక్టర్ సలహా మేరకు మాత్రమే వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ శ్రీనివాసరావు, నర్సింగ్ ఆఫీసర్ ఉదయ్‌శ్రీ తదితరులు పాల్గొన్నారు.

### సమీకృత బాలికల గురుకుల పాఠశాల సందర్శన

**బోనకల్:** మండంలోని సమీకృత బాలికల గురుకుల పాఠశాలను తహసీల్దార్ పున్నం చందర్ శుక్రవారం సందర్శించారు. విద్యార్థులకు ఇస్తున్న కాస్మోటిక్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించడంతో పాటు వైద్యపరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.

### యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

**వైరారూరల్:** ప్రతిరోజు యోగా చేయడం వలన ఎలాంటి రోగాలు దరిచేరకుండా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని యోగ శిక్షకురాలు పి.పద్మావతి అన్నారు. శుక్రవారం మండలంలోని గొల్లపూడి గ్రామంలోని ప్రభుతవ ఆయుర్వేద వైద్యశాలలో వైద్యుడు రాకేష్ ఆధ్వర్యంలో యోగ శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. యోగా అవశ్యకతను వివరించారు. పంచాయతీ కార్యదర్శి సునీత, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

**కొణిజర్ల:** మండలంలోని తనికెళ్లకు చెందిన బుడిగె సామ్రాజ్యం అనే మహిళ ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో వైద్యం చేయించుకొంది. ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సిఫారసు మేరకు మంజూరైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును శుక్రవారం సీపీఎం జిల్లా నాయకులు తాళ్లపల్లి కృష్ణ, షేక్ రంజాన్, చెరుకుమల్లి కుటుంబరావు, అన్నారపు వెంకటేశ్వర్లు, వేముల సాంబశివరావుల చేతుల మీదుగా అందజేశారు.

### అర్చక సంఘం ఆధ్వర్యంలో.. వనసమారాధన

**కారేపల్లి:** కార్తీక మాసాన్ని పురస్కరించుకొని.. అర్చక సంఘం ఆధ్వర్యంలో కారేపల్లి, కామేపల్లి, గార్ల, టేకులపల్లి, ఇల్లందు మండలాల పరిధిలో అర్చకులు శుక్రవారం భీక్యాతండా మామిడితోటలో వనసమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అంతకుముందు స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అర్చక కుటుంబాలు ఆట పాటలతో సరదాగా గడిపారు. ఈ సందర్భంగా వనసమారాధన పర్యవేక్షకులు అజ్మీర బిచ్యానాయక్ దంపతులను అర్చకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో అర్చక సంఘం నాయకులు కొత్తలంక కైలాసశర్మ, గోదావరి ఈశ్వరశాస్త్రి, కొండపల్లి శ్రీనివాసశర్మ, సురేష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

### 'చిన్నారి' కార్యక్రమంపై అవగాహన

**మధిర:** మండల పరిధిలోని రాయపట్నం ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో చిన్నారి కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యురాలు హేమలత మాట్లాడుతూ.. పిల్లలకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం డేవిడ్ రాజు, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ కోఆర్డినేటర్ ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయులతో ఆన్‌లైన్ చేయించొద్దు..

**కొణిజర్ల:** ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో కులగణన వివరాల ఎంట్రీ చేయించొద్దని ఎస్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దొడ్డా వరప్రసాదరావు, షేక్ కరామత్ అలీలు తెలిపారు. శుక్రవారం కొణిజర్లలో నిర్వహించిన ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. రానున్న 15 రోజుల్లో ఫార్మాటివ్-3 పరీక్షలు ఉన్నందున సిలబస్ పూర్తి చేసి విద్యార్థులను పరీక్షలకు సంసిద్ధులను చేయాల్సి ఉండడంతో.. డేటా ఎంట్రీ పనులు ఉపాధ్యాయులకు అప్పగించకుండా ఇతర డిపార్టుమెంట్ సిబ్బందికి అప్పగించాలన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**కారేపల్లి:** మండలంలోని కారేపల్లిక్రాస్‌రోడ్డు, చీమలపాడు, భాగ్యనగర్‌తండా సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న వ్యవసాయ మోటర్లకు ఈనెల 23వ తేదీ (శనివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33కేవీ కారేపల్లి ఫీడర్, ఇల్లందు నుంచి గాంధీనగరం రైల్వే ట్రాక్ వరకు విద్యుత్‌లైన్ల మరమ్మతు పనులు జరుగుతున్న కారణంగా.. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు వ్యవసాయ మోటర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## క్లుప్తంగా

### భూములు పరిశీలన

**ముదిగొండ:** మండలంలోని సువర్ణాపురం, ఖానాపురం, న్యూలక్ష్మీపురం గ్రామాల్లోని అస్సైంట్ భూములను తహసీల్దార్ సునీత ఎల్జిబెత్ శుక్రవారం పరిశీలించారు. సువర్ణాపురంలోని ఓ భూమిని ల్యాండ్ కనవర్షన్ కోసం వెంచర్ నిర్వాహకులు దరఖాస్తు చేసుకోగా ఆ భూమిని డీఆర్ఓ రాజేశ్వరి పరిశీలించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

### పంట అవశేషాలను భూమిలో కలియదున్నాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ మయాన్ మంజుఖాన్

**వైరారూరల్:** పంట అవశేషాలను కాల్చకుండా రోటరేటర్‌తో భూమిలో కలియదున్నాలని మండల వ్యవసాయ శాఖ అధికారి మయాన్ మంజుఖాన్ సూచించారు. మండలంలోని అష్ణగుర్తి గ్రామంలో శుక్రవారం పంట అవశేషాలు కాల్చడం వలన కలిగే నష్టాలపై రైతులకు అవగాహన కల్పించారు. పంట అవశేషాలు కాల్చడం వలన వాయు కాలుష్యం పెరగడంతో పాటు భూమిలో నత్రజని, భాస్వరం, పోటాష్, సేంద్రీయ శాతం తగ్గిపోవడంతో నేల గుల్ల బారుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు ఐలూరి వాసంతి, రైతులు పాల్గొన్నారు.

### సీనియర్ సివిల్ జడ్జికి సన్మానం

**మధిర:** మధిర కోర్టు సీనియర్ సివిల్ కమ్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి షేక్ మీరా ఖాసింను శుక్రవారం లీగల్ సర్వీస్, హ్యూమన్ రైట్స్ సభ్యులు కోట వెంకట్, కన్నెపాగు వెంకటేశ్వర్లు మధిర కోర్టులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు జడ్జిని శాలువాతో ఘనంగా సన్మానించారు.

### రాగి జావ పంపిణీ

**వైరా:** వైరాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ ఎల్.నవీన జ్యోతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా ప్రతి రోజు రాగి జావ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఘనంగా రాజసాయి మందిర వార్షికోత్సవం

**పెనుబల్లి:** మండలంలోని వీయంబంజర్ రాజసాయి మందిరం 25వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఆలయ నిర్వాహకుడు జెన్నారెడ్డి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి, కల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లు దోమ ఆనంద్ బాబు, రాజబోయిన కోటేశ్వరరావు, మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### గురుకులంలో ఆగ్రో ఎకాలజీ వర్క్‌షాప్

**కొణిజర్ల:** మండలంలోని తనికెళ్లలో గల తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఆగ్రో ఎకాలజీపై వర్క్‌షాప్ నిర్వహించారు. కళాశాలకు చెందిన బోటనీ, జువాలజీ డిపార్ట్‌మెంట్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్‌కు ఎంజీఆర్‌సీ ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్‌జీఓ డాక్టర్ కృష్ణాంకర్ ముఖ్య అతిధిగా హాజరై బాలికలకు వ్యవసాయం, ఆధునిక వ్యవసాయ పనుముట్లపై అవగాహన కలిపించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రావణి, వైస్ ప్రిన్సిపాల్ నవ్య, ఐక్యాక్ కోఆర్డినేటర్ ఐశ్వర్య, హెచ్ఓడీలు రజిత, యశోద, స్వర్ణలత, దీప్తి, జానకి, తదితరులు పాల్గొన్నారు.

### కేసు నమోదు

**ముదిగొండ:** ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి ఖమ్మం రూరల్ మండలం గుడిమళ్ల కు చెందిన గోనే అనూష(27)న్యూలక్ష్మీపురం సమీపంలోని గురువారం మృతిచెందిన విషయం విధితమే. ఈ ఘటనపై మృతురాలి భర్త సంపత్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ముదిగొండ సీఐ మురళి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ప్రజాపాలన విజయోత్సవ కళాజాతా

**కల్లూరురూరల్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలపై ప్రజల్లో చైతన్య పరచడానికి కలెక్టర్ ముజిమ్మిల్‌ఖాన్ ఆదేశాల మేరకు ప్రజాపాలన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మండలంలోని పలుగ్రామాల్లో కళాకారులు పాటలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కళాకారులు నల్లగాటి సుధాకర్, పరకాల అజయ్, మాచర్ల కృష్ణ, బంక భద్రయ్య, పిడియాల లక్ష్మయ్య, జ్యోతిలు పాల్గొన్నారు.

# బస్సు తప్ప అంతా తుస్సే..



ప్రొద్దుటూరులో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, పక్కన పువ్వాడ, కమలాకర్, ఎంపీ రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే సండ్ర తదితరులు

- మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- ప్రొద్దుటూరు సభలో ప్రభుత్వం తీరుపై విమర్శలు

**చింతకాని:** కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం తప్ప ఇతర ఏ హామీని నెరవేర్చలేదని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. ఎన్నికల ముందు బాండ్ పేపర్‌పై రాసి ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయని ప్రభుత్వం రాష్ట్రప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మండలంలోనిప్రొద్దుటూరు, లచ్చగూడెంల్లో శుక్రవారం పర్యటించిన ఆయన ప్రొద్దుటూరులో ఏర్పాటు చేసి సమావేశంలో మాట్లాడారు. రైతులంతా కన్నీళ్లు పెట్టుకుంటూ కేసీఆర్ ఉన్నప్పుడే బాగుందని చెబుతున్నారన్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక రైతుబంధు, బతుకమ్మ చీరలు, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్లు, దళితబంధు, బీసీబంధు, 24 గంటల విద్యుత్ బంద్ అన్నీ నిలిపేశారని విమర్శించారు. మహాలక్ష్మి కింద మహిళలకు రూ.2,500 చొప్పన ఇస్తామని చెప్పిన పాలకులు అక్కాచెల్లెళ్లలకు 11 నెలల డబ్బు బకాయి పడ్డారన్నారు. అలాగే, కల్యాణలక్ష్మి ద్వారా తులం బంగారు ఇస్తామని విస్మరించడం ద్వారా రాష్ట్రంలో 6లక్షల పెళ్లిళ్లకు 6లక్షల తులాల బంగారం బాకీ ఉన్నారని తెలిపారు. ఇక రైతు రుణమాఫీ, రైతుబంధు అమలుచేయడం లేదని హరీశ్‌రావు విమర్శించారు. కాగా, సీఎం కేసీఆర్ ఈ మండలంలో దళితబంధు అమలుచేయగా రెండో విడత నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తొలుత హరీశ్‌రావుకు నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు.



లచ్చగూడెంలో రైతు ప్రసాద్ కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మాజీ మంత్రి

**బాధిత కుటుంబాలకు పరామర్శ..**

ప్రొద్దుటూరులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న రైతు బోజెడ్ల ప్రభాకర్ కుటుంబసభ్యులను హరీశ్‌రావు పరామర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యంతోనే ఆయన ఆత్మహత్య చేసుకోగా కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అలాగే, ఇటీవల జైలుకు వెళ్లి వచ్చిన బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య కుటుంబంతో పాటు లచ్చగూడెంలో విద్యుదాఘాతంతో మృతి చెందిన గూని ప్రసాద్ కుటుంబాన్ని పరామర్శించారు. మాజీ మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, గంగుల కమలాకర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వరరావు, జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమలరాజ్‌తో పాటు బచ్చు విజయ్‌కుమార్, బొమ్మెర రాంమూర్తి, బొడ్డు వెంకట్రామయ్య, మంకెన రమేష్, వంకాయలపాటి లచ్చయ్య, గురిజాల హన్మంతరావు, నెల్లూరి రమేష్, గడ్డం శ్రీను, చాట్ల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

### కోనోకార్పస్ మొక్కలు తొలగింపు



బస్వాపురం రైతు వేదిక వద్ద మొక్కలను తొలగించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

**కొణిజర్ల:** ప్రాణాంతకం కోనో కార్పస్ పేరుతో ఈ నెల 21న సాక్షిలో వచ్చిన కథనానికి వ్యవసాయశాఖ అధికారులు స్పందించారు. బస్వాపురం గ్రామంలోని రైతు వేదికలో ఉన్న కోనోకార్పస్ మొక్కలన్నింటినీ తొలగించారు. ఈ మేరకు ఏఓ బాలాజీ గ్రామాల్లో సైతం ప్రజలకు మొక్కలు గురించి అవగాహన కల్పించి తొలగించే విధంగా చేస్తామన్నారు.

### రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి



మాట్లాడుతున్న బొంతు రాంబాబు

**వైరా:** కేంద్ర ప్రభుత్వం చెరుకు మద్దతు ధర టన్నుకు రూ.5 వేలు ప్రకటించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. ఈ నెల 23వ తేదీ ముట్టాపురంలో నిర్వహించే చెరకు రైతుల రాష్ట్ర అవగాహన సదస్సుకు రైతు సంఘం జాతీయ, రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రన్, పోతినేని సుదర్శన్ పాల్గొంటారన్నారు. ప్రభుత్వం చెరకు సాగు రైతులకు సబ్సిడీలు, రాయితీలు కల్పించి ప్రోత్సాహకాలు కల్పించాలని కోరారు. చెరకు రైతుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. మల్లెంపాటి రామారావు, బాణాల శ్రీనివాసరావు, కామినేని రవి, పల్లెబోయిన కృష్ణ, నర్వనేని యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

### మిరపలో కొమ్మకుళ్లు తెగులు ఉధృతి

**కొణిజర్ల:** మండలంలోని రైతులు సాగు చేస్తున్న మిరప తోటలలో కొమ్మకుళ్లు ఉధృతి బాగా కనిపిస్తుందని మండల వ్యవసాయాధికారి బాలాజీ అన్నారు. మండలంలోని చిన్నగోపతిలో శుక్రవారం ఆయన మిరప తోటలను పరిశీలించి మాట్లాడారు. మబ్బులతో కూడిన వాతావరణం ఉన్నప్పుడు ఈ శిలీంద్రం బాగా అభివృద్ధి చెందుతుందన్నారు. కొమ్మకుళ్లు కనిపించగానే ఒకటి రెండు చెట్లు ఉండగానే వాటిని తొలగించి కాల్చి వేయాలని, క్రిమి సంహారక మందులు సాయంత్రం పూట మాత్రమే పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాసరాజు, రైతులు పొట్లపల్లి శ్రీనివాసరావు, చిన్న జీడయ్య, అనిల్,నరేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా మాలధారుల ఇరుముడి, అన్నదానం



అంజనాపురంలో స్వాములకు ఇరుముడి కడుతున్న గురుస్వాములు

**తల్లాడ:** మండలంలోని అంజనాపురం గ్రామంలోని కోదండ రామస్వామి దేవాలయంలో శుక్రవారం అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమం వైభవంగా జరిగింది. స్థానిక కోదండ రామాలయంలో 30మంది అయ్యప్ప స్వాములకు అర్చకులు మణికంఠ శర్మ ఆధ్వర్యంలో ఇరుముడి కట్టారు. 41 రోజులు కఠిన దీక్ష అనంతరం ఇరుముడితో స్వాములు కేరళ రాష్ట్రంలోని శబరిమలైకు బయలుదేరారు. ఈ సందర్భంగా అయ్యప్ప భక్త బృందం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో అంజనాపురం, పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.


**ట్రాన్స్‌జెండర్ల అన్నప్రసాదం..**



భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

**సత్తుపల్లిటౌన్:** పట్టణంలోని మాతా ఫౌండేషన్(ట్రాన్స్‌జెండర్స్ కమ్యూనిటీ) ఆధ్వర్యాన అయ్యప్ప మాలధారణ భక్తులకు అన్నప్రసాదం(భిక్ష) శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా హనుమాన్ చాలీసాపారాయణం, అయ్యప్ప భజనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాతా ఫౌండేషన్ నిర్వాహకులు చిత్ర, స్పందన, అను, రచన, అస్మిత, సాయిపల్లవి, అశ్విని, శివాని, దివ్య, గ్రీష్మ పాల్గొన్నారు.

## మాదిగ ఉపకులాలకు తీవ్ర అన్యాయం..



మాట్లాడుతున్న రత్నాకర్

**సత్తుపల్లిరూరల్:** ఎస్సీ వర్గీకరణ జరగక మాదిగ ఉపకులాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఎంఎస్ఎఫ్ జిల్లా నాయకుడు ఊటుకూరి రత్నాకర్ అన్నారు. శుక్రవారం సత్తుపల్లిలోని తేజ ఒకేషన్ కళాశాలలో నిర్వహించిన ఎంఎస్ఎఫ్ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీల వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి అమలు చేస్తామని హామీ ఇచ్చి మూడు నెలలు గడిచినా పట్టింపు లేదన్నారు. ఈ మేరకు ఈనెల 27న ఖమ్మంలో జరిగే మాదిగ విద్యార్థుల సదస్సును విజయవంతం చేయాలన్నారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందాకృష్ణ మాదిగ హాజరవుతారన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ముత్తారావు మాదిగ, గోళ్లమూడి శ్రీనివాసరావు మాదిగ, పరిగడుపు లక్ష్మణ మాదిగ, తాళ్ల అర్జున్‌రావు, గద్దల దేవన్న, దువ్వూరి రమేష్, కొత్తపల్లి సాయికుమార్, మాదిగ విద్యార్థులు పాల్గొన్నారు.